క్లుప్తంగా

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



ఉపకరణాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

గుర్ల: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతులకు ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు శనివారం వివిధ ఉపకరణాలను పంపిణీ చేశారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. అనంతరం భవిత కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, ఇజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి దగ్ధమైన ధాన్యం బస్తాల పరిశీలన



కాలిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిన ధాన్యం బస్తాలను తహసీల్దార్ రమేష్ శనివారం పరిశీలించారు. సర్పంచ్ నారాయణప్పలనాయుడు, బాధిత రైతు దత్తి సూరమ్మను కలిసి ప్రమాదానికి గల కారణాలు, నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు.

భూసర్వేకి సహకరించాలి



భూసర్వేపై మ్యాప్ సాయంతో రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సురేష్

చీపురుపల్లి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. మండలంలోని అలజంగి పంచాయతీలో చేపట్టనున్న భూసర్వేకి సంబంధించి శనివారం గ్రామసభ నిర్వహించారు. భూసర్వేపై రైతులు, గ్రామస్తులకు రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, సర్వే సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రఘుమండ త్రినాథ్, బవిరి రవి శంకర్, శనపతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవిరాజ్

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస వద్ద జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడినట్లు ఎస్.భూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. బాడంగి నుంచి విజయనగరం వైపు బైక్‌పై వెళ్తున్న రవిరాజ్ అనే వ్యక్తిని విజయనగరం నుంచి సాలూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తలకు బలమైన గాయం కావడంతో క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందజేస్తున్నారు.

అంగన్‌వాడీలకు నిధుల మంజూరు

గుర్ల: మండల కేంద్రంలోని ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్ మరమ్మతుల కోసం రూ.2.50 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు ఎంపీపీ పొట్నూరు ప్రమీల శనివారం తెలిపారు. విద్యుత్ సౌకర్యం లేకుంగా ఇబ్బందులు పడుతున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంపీపీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన మండల పరిషత్ నిధుల నుంచి ఈ మొత్తాన్ని మంజూరు చేశారు.

ఎంపీడీఓ పరిశీలన



అప్పన్నదొరపాలెం అంగన్‌వాడీ కేంద్రాలో చిన్నారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ పద్మజ

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెం, చింతలదిమ్మ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ వై.పద్మజ శనివారం సందర్శించారు. కేంద్రాల్లో పిల్లల హాజరు, వారికి అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ఆమె వెంట స్థానిక సర్పంచ్ జోడి రాములమ్మ ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు, ఇతర మౌలిక వసతులన్నీ కల్పిస్తున్నామని, స్థలాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులు కోరారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం పలు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణాల పురోగతి, అక్కడి వసతులను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకుని నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు.



చీపురుపల్లి రూరల్: లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ, తదితరులు

కొత్తవలస: మండలంలోని అప్పన్నదొరపాలెంలో ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీఓ వై.పద్మజ, హౌసింగ్ ఏఈ రాంప్రసాద్, స్థానిక సర్పంచ్ జోడి రాములమ్మతో పాటు ఉపాధి, విద్యుత్, పంచాయతీ అధికారులు పరిశీలించారు.

లక్కవరపుకోట: మండలంలోని వీరభ్రపేట జగనన్న లేవుట్‌ను తహసీల్దార్ టి.రామకృష్ణ, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరావు సందర్శించారు. ఇక్కడ మంజూరైన 9 ఇళ్ల నిర్మాణాలు చివరిదశకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

వేపాడ: మండలంలోని ఆతవ, ఆకులసీతంపేట గ్రామాల్లో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, తహసీల్దార్ కృష్ణంరాజు, ఎంపీడీఓ పట్నాయక్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణతో పాటు పలువురు అధికారులు స్థానిక నేతలు పర్యటించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామంలో జగనన్న లేఅవుట్‌ను తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఎ.వేదవతి, హౌసింగ్ ఏఈఈ రమణరాజు, ఉపాధి ఏపీఓ కృష్ణవేణి తదితరులు శనివారం సందర్శించారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని లబ్ధిదారులకు సూచించారు.



కొత్తవలస: అప్పన్నదొరపాలెంలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

చీపురుపల్లి రూరల్: మండలంలోని చిననడిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, తదితరులు పరిశీలించారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించడం సామాజిక బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గార తవుడు, సీఐ అప్పలనాయుడు

గజపతినగరం: రహదారి భద్రత అనేది ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, కరణం ఆదినారాయణ, కె.సుబ్రహ్మణ్యం, గజపతినగరం, ఆంధ్ర, బూర్జివలస ఎస్సైలు గంగరాజు, సిద్దార్థ, రాజేష్ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎస్.కోట పట్టణంలో పోలీసులు శనివారం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ సింహాద్రినాయుడు నేతృత్వంలో ఎస్సైలు తారకేశ్వరరావు, లోవరాజు, పోలీసులు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సాయిబాబా గుడి వరకు ర్యాలీ చేపట్టారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించండి.. ప్రమాదాల నుంచి బయటపడండి అంటూ ప్రచారం చేశారు.

సచివాలయ సేవలను ప్రజలకు చేరువచేయాలి

- ఎంపీపీ పీరుబండి హైమావతి

గంట్యాడ: గ్రామ సచివాలయాల సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం సచివాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను, ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను పరిశీలించారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా నడచుకోవాలని సిబ్బందికి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందలేదనే ఫిర్యాదులు రాకూడదన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయడంతో పాటు సచివాలయానికి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీడీఓ భవానీ, ఇన్‌చార్జి తహసీల్దార్ స్వర్ణకుమార్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ హైమావతి

వైద్య సిబ్బందికి సేవారత్న అవార్డు



ప్రశంసా పత్రం అందుకుంటున్న వైద్యాధికారి భాగ్యరేఖ

జామి: కోవిడ్ సమయంలో అందించిన సేవలకుగాను జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖకు, క్షేత్రస్థాయి సిబ్బందికి సెయింట్ మదర్‌థెరిసా సంస్థ సేవారత్న అవార్డును ప్రదానం చేసింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమూర్తి శనివారం అవార్డుతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది లత, పార్వతి, గీతాంజలి, శ్యామసుందరి, భూలక్ష్మి, ఈశ్వరమ్మ ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.అనిల్‌ప్రేమ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైభవంగా తీర్థాలు



కొత్తవలస: పూలజ్యోతికి పూజలు చేస్తున్న వైస్ ఎంపీపీ శ్రీను, తదితరులు



కొత్తవలస: ఆకట్టుకున్న మహిళల కోలాటం



వేపాడ: ఆతవలో వేమాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు



వేపాడ: అరిగిపాలెంలో మహిళల కోలాటం



వేపాడ: హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

కొత్తవలస: మండలంలోని రాజుపాత్రునిపాలెం గ్రామంలో రావాలమ్మ అమ్మవారి తీర్థమహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారి పూల జ్యోతిని, చెక్క గుర్రాలను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో ఊరేగించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి, కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయుకుడు రామన్నపాత్రుడు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

ఆతవలో వేమాలమ్మ తీర్థం

వేపాడ: మండలంలో ఆతవ గ్రామదేవత వేమాలమ్మ తీర్థమహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకుని, దూప దీప నైవేద్యములతో పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. ఉత్సవం సందర్భంగా సర్పంచ్ గొంప వేమాలినాయుడు, గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఆకట్టుకున్న మహిళల కోలాటం

వేపాడ: మండలంలోని అరిగిపాలెం గ్రామంలో గ్రామదేవత చుక్కమాంబ అమ్మవారి తీర్థమహోత్సవం వైభవంగా జరుగుతోంది. రెండోరోజు శనివారం యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు



చీపురుపల్లి: ఆటో డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీపురుపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవరావు సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని ఆటో డ్రైవర్లతో స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశమై ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఆటోల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకోరాదని, మితిమీరిన వేగంతో ప్రయాణించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

124 మందికి వైద్య పరీక్షలు

గుర్ల: మండలంలోని జమ్ములో తిరుమల ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ సోనూజీ 124 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.

రంగారాయపురంలో పశువైద్య శిబిరం



పశువులకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ గాయత్రీదేవి

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి కె.గాయత్రీదేవి చూడి, ఎదకు రాని పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స అందించారు. పాడిపశువుల పోషణ, ఆడపెయ్యల ఉత్పత్తి పథకం, పశుగ్రాస పెంపకం, పశువులకు సంక్రమించే వ్యాధులు–నివారణ, పాడిరైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థులకు మూగజీవాల సంరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కంది ధర్మకుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్ అధ్యక్షతన రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఓటర్ల నమోదు, ఓటు ఆవశ్యకతపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్నికల డీటీ లక్ష్మి, ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్ ఓటు విలువ, ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం లక్ష్మి

శృంగవరపుకోట: మండలంలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం బి.లక్ష్మి తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు డి.అరుణ్‌కుమార్, ఎ.హారిక ఈనెల 23 నుంచి 25 వరకు చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ బాల్‌బాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీరాములు చెప్పారు. ఎంపికయిన క్రీడాకారులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- న్యాయమూర్తులు ఎస్.సూర్యకిరణ్‌శ్రీ, కనకలక్ష్మి



కొత్తవలస: కోర్టు హాల్‌లో పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహిస్తున్న న్యాయమూర్తి సూర్యకిరణ్‌శ్రీ



గజపతినగరం: పోలీసులు, న్యాయవాదులకు సూచనలు చేస్తున్న జడ్జి కనకలక్ష్మి

కొత్తవలస: గ్రామాల్లో జరిగిన చిన్నచిన్న గొడవలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకోకుండా రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ అన్నారు. వచ్చే నెల 11న స్థానిక కోర్టు సముదాయంలో జాతీయ మెగా లోకఅదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి శనివారం ఎల్.కోట, కొత్తవలస, వేపాడ మండలాల పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా సహకరించాలని కోరారు. ఈ మేరకు కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు ఎస్.ముకుందరావు, బి.దేవి, ఈఎస్‌బీ సీఐ రాజేశ్వరి, నాయవాదులు డి.శ్రీనివాస్, జి.కృష్ణ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

గజపతినగరం: స్థానిక కోర్టు సముదాయంలో ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మి అన్నారు. కోర్టు హాల్‌లో శనివారం న్యాయవాదులు, పోలీసులతో సమావేశమై కార్యక్రమం వివరాలను వెల్లడించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు.

విద్యార్థులకు ఇబ్బంది కలిగించొద్దు



బొండపల్లి: దేవుపల్లి కేజీబీవీలో వసతులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాఠశాల సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.వేదవతి సూచించారు. మండలంలోని దేవుపల్లి కేజీబీవీని శనివారం ఆమె సందర్శించారు. విద్యాలయంలో వసతులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజన మెనూ పక్కాగా అమలు చేయాలని, నాణ్యమైన బోధన అందించాలని ఎస్‌ఓకు సూచించారు. ఆమె వెంట ఏపీఓ బి.కృష్ణవేణి ఉన్నారు.

మెనూ పక్కగా అమలు చేయాలి

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూ పక్కాగా అమలు చేయాలని ఎంఈఓ జి.శ్రీదేవి అన్నారు. మండలంలోని ముకుందపురం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆమె సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, పెరటి కూరగాయల సాగు, పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యార్థుల అభ్యసన స్థాయి పరిశీలన

గజపతినగరం: ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు మననం చేసుకోవడం ద్వారా వాటిని చిరకాలం గుర్తించుకోవచ్చని సీఆర్పీ రెడ్డి సూచించారు. ఎం.వెంకటాపురం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పరీక్షించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

రాజరాజేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శనివారం అమావాస్య(పుష్య అమావాస్య) సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శనీశ్వర స్వామికి భక్తులు తైలాభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్ శర్మ భక్తులు గోత్ర నామాలతో పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

జామి: మండలంలో భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వరప్రసాద్ స్వామివారిని పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

సంక్షిప్తంగా...

ధాన్యం నిల్వలకు జియోట్యాగింగ్

జామి: రైతులు పండించిన ధాన్యానికి ఆర్‌బీకే సిబ్బంది తప్పనిసరిగా జియోట్యాగింగ్ చేయాలని వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. రైతులు కళ్లాల్లో ఉన్న ధాన్యం కుప్పలు, లేదా నూరిడి అయిన ధాన్యానికి సంబంధించి ఆర్‌బీకేలకు వెళ్లి జియోట్యాగింగ్ చేయించుకోవాలన్నారు. గతంలో ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతులు పండించిన పంటకు జియోట్యాగింగ్ చేసుకుంటేనే ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

ఇంధనశక్తి పరిరక్షణపై అవగాహన



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, తదితరులు

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఇంధనశక్తి, పరిరక్షణపై ప్రిన్సిపాల్ ఆర్.ఈశ్వరరావు శనివారం అవగాహన కల్పించారు. సహజ వనరులు లభ్యత తగ్గిపోతున్నందున దేశ ఆర్థిక ప్రగతికి ప్రధానమైన ఇంధన శక్తిని ఆదాచేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇంధనశక్తి పరిరక్షణపై విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వ్యాసరచన పోటీలు



గజపతినగరం: వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

గజపతినగరం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారి పోటీలను పర్యవేక్షించారు. ఓటు హక్కు ఆవశ్యకతను తహసీల్దార్ విద్యార్థులకు వివరించారు. విజేతలకు ఈ నెల 25న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు చెప్పార. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రిమాండ్

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట ఎస్సీ కాలనీకి చెందిన తాడ్డి పైడిరాజు అనే మహిళ తన ఇంటి వద్ద సారా అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై గంగరాజు శనివారం తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

జాకేరు ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

వేపాడ: జాకేరు గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కాటపల్లి శ్రీను(47) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈయనకు భార్య దేవి, కుమారుడు పూర్ణచంద్రశేఖర్, కుమార్తె ఉమామహేశ్వరి ఉన్నారు. ఉపాధిహామీ పథకం ఏపీఓ, సిబ్బంది మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.